503) రామక్రియ

ప|| ఆతనిబో పొగడేము ఆతని శరణంటిమి | ఆతడే సర్వజీవుల అంతర్యామి ||

చ|| పెక్కుబ్రహ్మాండకోట్లుపెక్కు బ్రహ్మకోట్లు |పెక్కురుద్రకోట్లునుపెక్కుయింద్రులు |
వొక్కొక రోమకూపాల నొగి నించుకుండునటి | వొక్కడే విష్ణుడు వీడే వున్నతోన్నతుడు ||

చ|| అనంతసూర్యచంద్రులు అనంతవాయువులును | అనంతనక్షత్రము లనంతమేరువులు |
కొనలుసాగీ నన్నిటికూటువ గూడుకొన్నట్టి | అనంతు డొక్కడే మించీ నాదిమూరితి ||

చ|| అసంఖ్యమహిమలను అసంఖ్యమాయలు | అసంఖ్యశక్తులు వరా లసంఖ్యాలు |
పొసగ నిన్నిటి దానే పుట్టించి రక్షించినట్టి | అసంఖ్యాత్ముడు శ్రీవేంకటాద్రీశుడు ||